కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్


పరిశీలిస్తున్న జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్

నిర్మల్, న్యూస్‌టుడే : కుటుంబ డిజిటల్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డు జారీ కోసం పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మల్ పట్టణంలోని 42వ వార్డు(చింతకుంటవాడ, పింజారిగుట్ట, పాత బస్టాండ్)లలో శుక్రవారం నిర్వహించిన సర్వే తీరును పరిశీలించారు. సర్వే నమోదులో ఏమైనా సమస్యలు ఏర్పడుతున్నాయా అని బృంద సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబంలో పెద్ద వయసున్న మహిళ పేరునే ప్రామాణికంగా తీసుకోవాలని, ఎలాంటి తప్పులు లేకుండా సర్వే చేపట్టాలని బృంద సభ్యులను ఆదేశించారు. అదనపు పాలనాధికారి(స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకల్యాణి, మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా పీడీ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

చక్రం ఆట కాదు.. స్వచ్ఛతలో భాగమే..

ఇంటింటా పరిశుభ్రత పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే నిర్వహిస్తున్నారు. నిల్వ నీరు లేకుండా చేసి దోమలను అరికట్టాలని దీని ప్రధాన ఉద్దేశం. శుక్రవారం మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో ఓ ఇంటి పరిసరాల్లో పాత ట్రాక్టర్ చక్రం(టైర్)లో మురుగు నిల్వ ఉండటంతో అధికారులు గుర్తించి ఇలా తొలగించారు. దూరం నుంచి చూస్తే టైర్‌తో ఆట ఆడినట్లు కనబడుతోంది కదూ.. **- న్యూస్‌టుడే, దిలావర్‌పూర్**


సిర్గాపూర్‌లో పాత చక్రం నుంచి నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న కార్మికులు

భాషపై పట్టు.. మార్కులు కొట్టు

10
- తప్పులు లేకుండా రాయడం..
- వ్యాకరణ అంశాలపై అవగాహన అవసరం


దండేపల్లి, న్యూస్‌టుడే

పదో తరగతి పరీక్షలకు మరో అయిదు నెలల సమయం ఉన్నా. ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. చాలా మంది విద్యార్థులు ఆప్షనల్ సబ్జెక్టులను బాగా సాధన చేస్తూ భాష విషయాలను పట్టించుకోరు. దీంతో జీపీఏ తగ్గే అవకాశముంది. మంచి జీపీఏ సాధించాలంటే అన్ని సబ్జెక్టులపై అవగాహన కలిగి ఉండాలి. ఈ నేపథ్యంలో తెలుగు, హిందీ, ఆంగ్లం ఉపాధ్యాయులు అందజేస్తున్న సూచనలు ఇలా...



వ్యాకరణం.. పద్యసాధనతో ఉత్తమ ఫలితం

తెలుగు..



చుక్క గుర్తు పెట్టిన పద్యాలు రాసి వాటి భావాలు, ప్రతిపదార్థం, కవి పరిచయం, రచనాశైలిపై అవగాహన పెంచుకోవాలి. పాదభంగం లేకుండా పద్యం పూరించి భావం రాస్తే ఐదు మార్కులు ఖాయం.
- పద్య, గద్య ఉపవాచకాల నుంచి 6 వ్యాస రూప ప్రశ్నలుంటాయి. ఛాయిస్ పోనూ మూడింటికి సమాధానం రాస్తే 21 మార్కులు వస్తాయి. కథానిక, కథ, కవిత, గేయం, పాట, ఆహ్వానపత్రం, ముఖాముఖి ప్రశ్నావళి, అభినందన పత్రం, నాటకం, నాటిక, సంభాషణ, ప్రకటనలు, కరపత్రం తయారు చేయడంపై పట్టు సాధిస్తే ఏడు మార్కులు సాధిస్తారు..
- పదజాలం, సంధులు, సమాసాలు, అలంకారాలు, గణవిభజన, వాక్యాలను సాధన చేయాలి.
- పద్య భాగంలోని భిక్ష, దానశీలం, శతక మధురిమ పాఠ్యాంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగే అవకాశముంది.
- అపరిచిత (పుస్తకంలో లేనిది) పద్యం, గద్యం ఇచ్చి దీని కిందనే ప్రశ్నలు ఉంటాయి. వీటిని అవగాహన చేసుకుని జవాబులు రాస్తే పది మార్కులు వస్తాయి.
- తెలుగులో దస్తూరి బాగుండటంతో పాటు అక్షర దోషాలు లేకుండా రాయగలగాలి.


బి.హరిచరణ్, తెలుగు భాషోపాధ్యాయుడు, ఉన్నత పాఠశాల తేజాపూర్, ఆదిలాబాద్ జిల్లా

భాషపై అవగాహన ముఖ్యం

హిందీ..

పఠిత, అపఠిత గద్యాంశాలు, పద్యాంశాలు నేర్చుకుంటే 20 మార్కులు వస్తాయి. వ్యాకరణంలో భాషాభాగాలు, వ్యతిరేక పదాలు, సమానార్థాలు, వచన్, ఉపసర్గ్, ప్రత్యయ్, పునరుక్తి శబ్దాలు, మహావరాల నుంచి 20 మార్కులు. పద్య, గద్య భాగాలలోని ముఖ్యమైన పాఠ్యాంశాల సారాంశాలను సొంత మాటల్లో రాసేలా అభ్యాసం చేయాలి. ఉపవాచకంలోని గద్యాంశాలపై దృష్టి పెడితే మంచి మార్కులు వస్తాయి. ప్రతి పాఠంలోని కవి పరిచయాల సాధన తప్పనిసరి.
- పాదభంగం లేకుండా చూడాలి. డైరీ, పోస్టర్, సంవాదం, సూచన, లేఖలు, కరపత్రం తయారీ, నిబంధ్ పై సాధన చేయాలి.


కె.వామన్‌రావు, హిందీ ఉపాధ్యాయుడు, జైనూర్ ఉన్నత పాఠశాల కుమురం భీం జిల్లా

పదజాలంపై పై దృష్టి సారించాలి

ఆంగ్లం..



ప్రశ్నపత్రం పార్ట్ ఏ, బీ విభాగాలుగా ఉంటుంది. 'ఏ'లో రెండు మైనర్ డిస్కోర్స్‌లు, ఒక మేజర్ డిస్కోర్స్ ఉంటాయి. మైనర్‌లో మెసేజ్‌లు, డైరీ, నోటీస్‌లు, పోస్టర్, ఇన్విటేషన్, ప్రొఫైల్ ఉంటాయి. వీటిని సాధన చేస్తే పది మార్కులు వస్తాయి. మేజర్‌లో లేఖలు, బయోగ్రఫీ, కొరియోగ్రఫీ, కన్వర్షేషన్, న్యూస్ రిపోర్ట్, ఇంటర్వ్యూ, తదితర అంశాలు ఉంటాయి. వీటిని సాధన చేస్తే 10 మార్కులు.. అంటే మొత్తం కలిపి 20 మార్కులు వచ్చినట్టే. అదే విధంగా రెండు ప్యాసేజీలు ఉంటాయి. వీటిని చదివి ప్రశ్నలకు జవాబులు రాస్తే 24 మార్కులతో మొత్తం పార్ట్ ఏలో 60 మార్కులుంటాయి.
- పార్ట్ బిలో వ్యాకరణం, ఎడిటింగ్, తప్పులను సవరించడం (కరెక్టింగ్ ఎర్రర్స్), పద్యం చదివి ప్రశ్నలకు సమాధానాలు రాస్తే పది మార్కులు సాధించవచ్చు. పుస్తకంలో లేని ప్యాసేజీ ఇచ్చి దీనిని చదివి మల్టీపుల్ ఛాయిస్‌లో ప్రశ్నలుంటాయి. వీటికి 20 మార్కులుంటాయి.
- వ్యాకరణం, తప్పులు లేకుండా రాయడం, ప్యాసేజీలు అవగాహన చేసుకుని జవాబులు రాస్తే మంచి జీపీఏ సాధించవచ్చు.


రమాబిందు, ఆంగ్ల ఉపాధ్యాయురాలు, వెల్గనూర్ ఉన్నత పాఠశాల, మంచిర్యాల జిల్లా

అందం.. ఆదమరిస్తే ప్రమాదం


బండరాళ్ల నడుమ కనువిందు చేస్తున్న నీరు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: చుట్టూ ఎత్తైన బండరాళ్లు.. పచ్చని చెట్లు.. నీలాకాశం.. తటాకాన్ని తలపించేలా నీళ్లు.. చూడగానే ముగ్ధ మనోహరంగా ఉంది కదూ చిత్రం. ఎక్కడో అటవీ ప్రాంతంలోని దృశ్యం కాదిది. నిర్మల్ పట్టణంలోనిదే. నమ్మశక్యంగా లేదు కదూ. స్థానిక భీమన్నగుట్ట సమీపంలోని గుట్ట ప్రాంతమిది. గతంలో ఇక్కడ క్రషర్ యంత్రాలు నిరంతరాయంగా నడిచేవి. ఈ క్రమంలో పూర్తిగా బండరాయితో ఉన్న గుట్టను ఇలా తొలిచేశారు. తుదకు ఇదిగో ఇలా తయారైంది. లోతుగా మారిన ప్రాంతంలో నీరుచేరడంతో చెరువును తలపిస్తోంది. చూసేందుకు నేత్రానందం పంచుతున్న ఈ ప్రదేశం ప్రమాదాలకూ హేతువవుతోంది. ఇప్పటికే ఇందులో పడి ముగ్గురు చనిపోయిన ఘటనలున్నాయి. ఫొటోలు దిగేందుకు, చూసేందుకు వెళ్లినవారు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా జారి అందులో పడిపోయే అవకాశాలు ఎక్కువ. లోతు ఎంతో తెలిసే అవకాశం లేదు. ఎక్కడ గుంతలున్నాయో, ఎక్కడ పగిలిన బండరాళ్లున్నాయో గుర్తించలేం. ఇవే అందులో పడినవారికి ప్రాణాంతకంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి తగిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడమో, చుట్టూ రక్షణ కంచె బిగించడమో చేస్తే ప్రమాదాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుంది.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

సారంగాపూర్, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా జిల్లాలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నట్లు మేనేజర్ విజయలక్ష్మి తెలిపారు. బ్యుటీషియన్, పూల దండల అల్లికల్లో ఆరు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.500 ఉపకార వేతనం అందిస్తామని, శిక్షణ పూర్తయ్యాక రూ.15 వేల విలువగల పనిముట్ల కిట్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల 18 నుంచి 70 ఏళ్లలోపు మహిళలు మీ సేవ, సీఎస్‌సీ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసి ప్రతిని మహిళా ప్రాంగణంలో అందజేయాలని సూచించారు.

పంట రుణాలపై తర్జనభర్జన

- 30 శాతం దాటని లక్ష్యం

నిర్మల్, న్యూస్‌టుడే : వానాకాలం సీజన్ ముగియడానికి వస్తున్నా పంట రుణాలివ్వడంలో అధికారులు రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పించుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 30 శాతం కూడా పంపిణీ చేయలేదు. ప్రతి మూడు నెలలకోసారి బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించి తమ పరిధిలో లక్ష్యం చేరుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలిస్తారు. రెండు నెలలుగా రుణమాఫీ ప్రక్రియతోనే గడిచిపోవడంతో లక్ష్యంపై అంతగా దృష్టి సారించలేదని స్పష్టమవుతోంది.

జిల్లాలో పంట రుణాల వివరాలు(రూ.కోట్లలో)
- లక్ష్యం: 3,864.03
- పంపిణీ చేసింది: 1,101.38
- శాతం : 28.5

జిల్లాలో రుణమాఫీ వివరాలు
- విడత
- రైతులు
- మాఫీ సొమ్ము (రూ.కోట్లలో)

విడత	రైతులు	మాఫీ సొమ్ము (రూ.కోట్లలో)
మొదటి	29,432	167.74
రెండో	18,729	196.86
మూడో	16,581	224.35

అర్హత ఉన్నా మాఫీ కాలేదు

జిల్లాలో రుణమాఫీ అర్హత ఉండి పొందని రైతుల వివరాల నమోదు ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇందుకోసం వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల వారీగా ఆధార్, రేషన్ కార్డు, ఇంటి పేరులో దొర్లిన తప్పులు, తదితర వివరాలు సేకరిస్తోంది. జిల్లాలో రెండు బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపడంలో జరిగిన పొరపాటుతో అర్హత ఉన్న వారికి మాఫీ కాలేదు. ఈ సీజన్‌లో రుణమాఫీ కారణంగా పంట రుణాల పంపిణీలో కాస్త ఆలస్యమైందని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ప్రతీ సీజన్‌లో అన్ని బ్యాంకులు 90 శాతం లక్ష్యం చేరుకునేలా ఇటీవల జరిగిన సమావేశంలో చర్చించారని, రుణమాఫీకి సంబంధించి బ్యాంకుల్లో తప్పులు దొర్లిన వారి వివరాలు సరి చేస్తున్నామని వెల్లడించారు.

కొనసాగుతున్న కుటుంబ నిర్ధారణ

అర్హత ఉండి రుణమాఫీ కాని రైతుల దరఖాస్తుల ప్రకారం ఇప్పటి వరకు 16,500 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 13,424 మంది రైతుల కుటుంబాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మిగతా రైతుల కుటుంబ సభ్యుల వివరాలు పెండింగ్‌లో ఉన్నాయి. రుణమాఫీ ప్రత్యేక పోర్టల్‌లో మాఫీ కాని రైతుల ఆధార్ నెంబర్లు తప్పుగా ఉండటం, ఆధార్‌కార్డు, పాసుపుస్తకంలో పేర్లు వేర్వేరుగా ఉండటం, రేషన్‌కార్డుల్లోనూ పేర్లు సరిగా లేకపోవడంతో రుణమాఫీ జాబితాలో రుణాలు తీసుకున్న రైతుల పేర్లు కనిపించడం లేదు. బ్యాంకు పాసు పుస్తకంలో పేరు తప్పుగా ఉండటంతో రుణమాఫీ ప్రత్యేక పోర్టల్‌లో నాట్ ఫౌండ్ అని వస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చేస్తున్నారు. 2018 తర్వాత తీసుకున్న పంట రుణాలు రెన్యువల్ చేసుకున్నా 12 డిసెంబరు 2018కు ముందు తీసుకున్న రుణాల కారణంగా మాఫీ వర్తింపచేయలేదని అధికారులు చెబుతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో చాలా మంది అన్నదాతలు తమ భూములను వారి పిల్లల పేరిట మార్చడంతో వారు గతంలో తీసుకున్న రుణాలకు మాఫీ జాబితాలో పేరు రాలేదు. 2018 నుంచి 9 డిసెంబరు 2023 వరకు రుణం తీసుకున్న ఎంతో మంది రైతులు చనిపోయారు. వారి వారసులకు పట్టాభూములు వచ్చినా రుణ మాఫీ వర్తించలేదు. వారసత్వంగా భూములు, ఆధార్‌కార్డుల్లో పేర్లు, చిరునామా మారిన వారికి రుణమాఫీ కాలేదు.

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం

బ్యాంకుల ద్వారా తీసుకున్న రూ.2 లక్షలకు పైబడిన రుణమాఫీ గురించి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. రూ.2 లక్షలలోపు రుణం ఉండి మాఫీ కాని రైతుల కుటుంబ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తయ్యే దశలో ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే అమలు చేస్తాం. **- అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్**

గునుగు పూలతో ఉపాధి

పూలనే దేవుళ్లుగా కొలిచే బతుకమ్మ పండగ సందడి మొదలైంది. కరీంనగర్ జిల్లా రామడుగుకు చెందిన మహిళలు శుక్రవారం గునుగుపూల సేకరణకు 100 కిలోమీటర్ల దూరంలోని ఖానాపూర్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాలకు తరలివచ్చారు. పదుల సంఖ్యలో వాహనాల్లో తరలివచ్చి గునుగు పువ్వులను సేకరించి అమ్మకానికి వాహనంలో తీసుకెళ్తున్నారు. **- న్యూస్‌టుడే ఖానాపూర్**


గునుగు పూలతో వాహనంలో వెళ్తున్న కరీంనగర్ జిల్లాకు చెందిన మహిళలు

డీఎస్సీ పరిశీలన కేంద్రం సందర్శన


ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి


నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్‌లోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాష్ట్ర పరిశీలకుడు, పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకుడు సోమిరెడ్డి సందర్శించారు. పరిశీలన ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. నిపుణులైన ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో 12 బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిజ, రెండు జతల జిరాక్స్ ప్రతులను గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన వాటిని పరిశీలిస్తున్నామని డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి వివరించారు. శనివారం సాయంత్రం 5 గంటల్లోగా రావాలని, ఆ తర్వాత వచ్చిన వాటిని స్వీకరించబోమని పేర్కొన్నారు.

నేడు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

నిర్మల్ గ్రామీణం: డీఎస్సీ-2024లో 1:3 నిష్పత్తిలో విడుదల చేసిన జాబితాలో పేరు ఉండి, ఇటీవల ప్రకటించిన డీఎడ్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు శనివారం ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని జిల్లా విద్యాధికారి ఎ.రవీందర్‌రెడ్డి తెలిపారు. నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్‌లోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంట నుంచి సాయంత్రం 5 గంటలలోపు రావాలని సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

ఉపాధి నిధులతో కోనేరు మరమ్మతులు

ముథోల్, న్యూస్‌టుడే: ముథోల్‌లోని ముక్తదేవి ఆలయ కోనేరును స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మరమ్మతులు చేపడుతున్నట్లు డీఆర్‌డీఓ విజయలక్ష్మి అన్నారు. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు ముథోల్‌లోని అతిపురాతనమైన ముక్తదేవి ఆలయ అష్టముఖి కోనేరును పరిశీలించారు. కోనేరు మరమ్మతులు చేయడానికి అవసరమైన పనుల గురించి గ్రామస్థులతో చర్చించారు. అనంతరం డీఆర్‌డీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ చేపట్టాల్సిన పనుల గురించి నివేదిక తయారు చేయించి అధికారులకు సమర్పిస్తామన్నారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు సుదర్శన్, అధ్యక్షుడు రోళ్ల రమేష్, ఉపాధ్యక్షుడు తాటివార్ రమేష్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నారాయణ, మాజీ సర్పంచి రాజేందర్ పాల్గొన్నారు.



కుంగుబాటుకు గురైన పత్తిని చూపిస్తున్న శాస్త్రవేత్త రాంప్రసాద్

ఆధునిక సమాజంలో మనిషి ఎదుగుదలతో పాటు మానసిక ఒత్తిడి పెరుగుతోంది. దాన్ని అధిగమిస్తే తప్ప నిలదొక్కుకోవటం కష్టమవుతోంది. ఇది మనుషులకే కాదు చేలోని పంటల్లోనూ కనిపిస్తోంది. ప్రధానంగా 45 రోజుల దశకు చేరుకునే పత్తి పంటలోనూ మానసిక ఒత్తిడి పెరుగుతోంది. పసిగట్టి నివారించాల్సి వైద్యుడు రైతే. పత్తి పంటకు మానసిక ఒత్తిడా? అనేది నమ్మశక్యంగా లేదు. కానీ నమ్మితీరాల్సిందే అంటున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు. ఇంతకీ పత్తి పంటలోని మానసిక ఒత్తిడికి కారణాలేమిటి? నివారణ ఏమిటి? అనేదానిపై ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.రాంప్రసాద్‌తో 'ఈటీవీ-ఈనాడు' ప్రత్యేక ముఖాముఖి.



పత్తి పంటలో మానసిక ఒత్తిడి

- వాతావరణ సమతుల్యత లోపమే ప్రధాన కారణం

వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్తతో 'ఈటీవీ-ఈనాడు' ముఖాముఖి

ఈటీవీ – ఆదిలాబాద్

ఈ : సహజంగా మనిషిలో ఉండే మానసిక ఒత్తిడి పత్తి పంటలోనూ ఉంటుందనేది కొత్తగా వినిపిస్తోంది. నిజమేనా? దానికి కారణాలేమిటి?

రాంప్రసాద్ : ముమ్మాటికీ నిజమే. ప్రాణమున్న అన్ని జీవుల మాదిరిగా పంటల్లోనూ మానసిక ఒత్తిడి ఉంటుంది. ప్రధానంగా పత్తిలో స్పష్టంగా కనిపిస్తోంది. యవ్వన, వృద్ధాప్య దశలో వివిధ సమస్యలతో బాధపడే మనుషుల్లో కుంగుబాటుకు గురైనట్లే పత్తిపంట 40 రోజుల దశదాటిన తర్వాత రెండు రకాల ఒత్తిళ్లకు గురవుతుంది. అందులో మొదటిది అధిక వర్షపాతంతో ఊపిరాడకుండా గురయ్యే ఒత్తిడైతే, నీటి ఎద్దడి కారణంగా పోషకాలు లభించకుండా కుంగుబాటుకు గురయ్యే ఒత్తిడి రెండోది.

ఈ : మనుషులైతే తమ బాధలు, సమస్యలను వైద్యులకో, స్నేహితులకో వివరించి ఉపశమనం పొందవచ్చు. పత్తి పంట తన బాధను ఎలా వివరిస్తుంది. మనం ఎలా పసిగట్టవచ్చు?

రాం : మీరనేది నిజమే! మనుషులు తమ బాధలను మాటల ద్వారా వెల్లడిస్తారు. కుంగుబాటుకు గురయ్యే పత్తి పంట కూడా నేను ఒత్తిడిలో ఉన్నానని సాగుచేసే రైతులకు పెరుగుదల రూపంలో సంకేతం ఇస్తుంది. అదెలాగంటే నీరు ఎక్కువైనా, తక్కువైనా ఏపుగా పెరిగిన మొక్కలు సాయంత్రం తర్వాత మోడువారినట్లు కనిపిస్తాయి. గాలివీచినా కదిలినట్లుగా అనిపించవు. ఆకులు తలవాల్చి వడలిపోయినట్లు ఉంటాయి. క్రమంగా పూత, కాత రాలిపోతుంది. జీవంలేని మొక్కలుగా మారుతాయి. ఇవన్నీ ఇతరులకు తెలియకపోవచ్చు. రైతులకు తెలిసిన అంశాలే.

ఈ : కుంగుబాటుకు గురైన పత్తి పంటను ఎలా కాపాడుకోవచ్చు?

రాం : వ్యవసాయం చేసే ప్రతి రైతు పంటల యోగక్షేమాలను గుర్తించగలిగే వైద్యుడే. పత్తి పంటనే కాదు. ఏ పంటలో ఏ మార్పు వచ్చిందో? ఏం చేయాలో? ఎలా రక్షించుకోవాలో తెలిసిన జ్ఞానే. మేం చెప్పే సూచనల ప్రకారమైతే చేలోని పంటలకు అధిక నీటి నిల్వతో ఇబ్బంది లేకుండా చూసుకోవాలి. కాస్తంత తడి ఉండేలా చూసి ప్రతి 20 రోజులకోసారి ఎకరాకు 20 నుంచి 25 కిలోల యూరియా, 10 నుంచి 15 కిలోల పొటాష్‌ను మొక్క నేలభాగంలో వేయాలి. పూత, కాత రాలకుండా 10 రోజులకోసారి 13-0-45(పొటాషియం నైట్రేట్) పొడిని లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున తెగుళ్ల, పురుగు మందులతో కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేయటం ద్వారా పంటలను మానసిక ఒత్తిళ్ల నుంచి కాపాడుకోవటానికి దోహదం చేస్తుంది.

ఈ : ఇప్పుడున్న పంటల పరిస్థితి ఎలా ఉంది? మొక్కలు ఒత్తిళ్లకు గురికాకుండా రైతుకు దిగుబడులు తగ్గకుండా ఏం చేయాలి?

రాం : పత్తి పంట అంటే పసికందును సాకినట్లే. ప్రస్తుతం 90 రోజుల దశలో ఉన్న పంటను 140 రోజుల వరకు కాపాడుకోవాల్సిందే. మొక్కలు కుంగుబాటుకు గురికాకుండా క్రమం తప్పకుండా పోషకాలు అందిస్తే అనుకున్న దిగుబడి సాధించవచ్చు. మరో 10, 15 రోజుల్లో ఒకటి, రెండు వర్షాలు కురిస్తే బాగుంటుంది.

పర్యాటక బృందాలు
పర్యావరణ పరిరక్షణకు వారసులు

- విద్యాలయాల్లో అమలుకు నిర్ణయం


శ్యాంగఢ్

జిల్లా వివరాలు ఇలా..
- విద్యాలయాలు: 471
- విద్యార్థులు: 1.11 లక్షలు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: పర్యాటకంపై పిల్లలు, యువతలో అవగాహన తీసుకురావాలని, చరిత్ర, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకుంది. విద్యాలయాల్లో పర్యాటక క్లబ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 7-12 తరగతులు నిర్వహించే విద్యాలయాల్లో వీటిని అమల్లోకి తీసుకురావాలని సంకల్పించి సంబంధిత సలహాలు, సూచనలను జిల్లా విద్యాశాఖ అధికారులకు జారీ చేశారు.

చైతన్యం తీసుకొచ్చేలా..

ఇందులో 7-12 తరగతులు చదివే పిల్లలు సభ్యులుగా ఉంటారు. ప్రతి క్లబ్‌కు ఒక విద్యార్థి నాయకుడిగా, ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. సంబంధిత వివరాలను ytc.tourism.gov.inlub.rigistration వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంటుంది. సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతిని ఆస్వాదించడం, పర్యాటకం, పర్యావరణం తదితర విషయాలపై వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు దీన్ని చేపట్టారు. చదివే పిల్లలతోపాటు చుట్టుపక్కల ఉన్న ప్రజల్లోనూ అవగాహన పెంపొందించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

చరిత్రకు నిలయం జిల్లా..

నిర్మల్ జిల్లా అంటేనే ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఉన్న కోటలు, గఢ్‌లు వంటి కట్టడాలు నాటి రాజుల పాలనను గుర్తు చేస్తుంటాయి. జలాశయాలు, పచ్చని అటవీ సంపద, గుట్టల మధ్య నుంచి వెళ్లే రహదారులు, చరిత్రాత్మకమైన ప్రదేశాలకు నిలయం. అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన కొయ్య బొమ్మలు కలిగిన ప్రాంతం. సాహితీవేత్తలకు నెలవుగా చెప్పుకుంటారు. అలాంటి ఈ ప్రాంత విశిష్టతపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేలా తీర్చిదిద్దే ఈ పర్యాటక క్లబ్‌లతో మరింత మేలు కలగనుంది.

విద్యార్థులకు మేలు: - ఎ.రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

పర్యాటక క్లబ్‌ల ఏర్పాటుతో విద్యార్థులకు మేలు చేకూరనుంది. ఇక్కడి విశేషాలు తెలుసుకోవడంతోపాటు పర్యావరణం, పర్యాటకం, ప్రకృతిపై చైతన్యం రానుంది. చరిత్ర తెలుసుకునే అవకాశం ఏర్పడనుంది. ప్రతి విద్యాలయం నుంచి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

విహంగాల అందం.. అడవితో అనుబంధం


మామడ మండలం నల్దుర్తి అటవీ ప్రాంతంలో పక్షులను వీక్షిస్తున్న అధికారులు


ఆకట్టుకునే అందం వెంగన్న చెరువు సొంతం


జపం చేస్తున్నట్లు..


దీర్ఘాలోచనలో..


రామసక్కని చిలుకలు




కొనితెచ్చి పెట్టిన బొమ్మ కాదండోయ్.. నల్దుర్తి అడవిలో కనిపించిన పక్షి


ఆకాశంలో విహరిస్తూ..


దసరాకు ముందే పాలపిట్ట వచ్చేసింది

అటవీశాఖ ఆధ్వర్యంలో 70వ వన్యప్రాణి వారోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఆ శాఖ అధికారులు మామడ మండలం నల్దుర్తి అటవీ ప్రాంతంలోని రెండు పురాతన చెరువుల పరిధిలో పర్యటించారు. అధునాతన కెమెరాలతో పక్షులను వీక్షించారు. ఆ అటవీ ప్రాంతంలోని తుర్కం, వెంగన్న చెరువు ప్రాంతాలకు వలస వచ్చే పలు రకాల పక్షులు, ఆవరణ వ్యవస్థలో వాటి పాత్ర వంటి వాటిపై అధికారులు సిబ్బందికి అవగాహన కల్పించారు. వారు కెమెరాలో బంధించిన చిత్రాలను చూస్తే మన దగ్గర ఇంత అందమైన పక్షులున్నాయా? అని ఆశ్చర్యపోతాం. అటవీ క్షేత్రాధికారులు రామకృష్ణ, శ్రీనివాస్‌రావు, వేణుగోపాల్, ఉప అటవీ క్షేత్రాధికారి నజీర్‌ఖాన్, మామడ, దిమ్మదుర్తి రేంజ్‌ల సిబ్బంది ఉన్నారు.

- న్యూస్‌టుడే, మామడ

పసిపాప ఆకలి తీర్చేందుకు
6 కిలోమీటర్ల కాలినడక

● బేల మండలంలో దయనీయ పరిస్థితి..


పసిపాపకు డబ్బా పాలు తాగిస్తున్న కొడప మోతుబాయి




సాంగ్వి నుంచి పాల డబ్బాను తీసుకొస్తున్న అమ్మమ్మ కొడప లచ్చుబాయి

పుట్టిన 23 రోజులకే తల్లిని కోల్పోయిన పసిపాపను బతికించుకునేందుకు అమ్మమ్మ, అమ్మమ్మ అత్తయ్యలు పడరాని పాట్లు పడుతున్నారు. పసిపాప ఆకలి తీర్చేందుకు పాల డబ్బా కోసం గూడెం నుంచి రానుపోనూ 6 కి.మీ దూరం ప్రయాణిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం దుబ్బగూడ పంచాయతీ టెంబిరిగూడకు చెందిన దేశ్‌ముఖ్ మారుబాయికి ఆగస్టు 20న సొంత గ్రామంలో ప్రసవమైంది. ఆడపిల్లకు జన్మనిచ్చింది. సెప్టెంబరు 10న అనారోగ్యానికి గురికావడంతో భర్త దేశ్‌ముఖ్ లస్మ, గ్రామస్థులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తీసుకెళ్లారు. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మారుబాయి సెప్టెంబరు 13న మృతి చెందినట్లు భర్త తెలిపారు. హైదరాబాద్ నుంచి రూ.12 వేలు ఖర్చు చేసి శవాన్ని తీసుకొచ్చామని, అదే రోజు ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా రూ.20 వేల ఆర్థిక సాయం అందించారని అన్నారు. భార్య మృతి విషయం తెలిసిన అభిమన్యూ వాట్సాప్ గ్రుపు నిర్వాహకుడు మెస్రం శేఖర్‌బాబు పాప పాల కోసం రూ.30 వేలు అందజేశారు. మూడు రోజులకు ఒకసారి రూ.280 పాల డబ్బా కొనుగోలు చేసి పాలు తాగిస్తూ పాపను బతికించుకుంటున్నామని అమ్మమ్మ లచ్చుబాయి అన్నారు. పాప పాల డబ్బా కోసం టెంబిరిగూడ నుంచి సాంగ్వి వరకు మూడు రోజులకు ఒకసారి రానుపోనూ 6 కి.మీ దూరం కాలినడకన వాగు దాటి వెళ్తున్నామని అన్నారు. పాల డబ్బా కోసం వెళ్లిన సమయంలో వచ్చే వరకు తన అత్తమ్మ కొడప మోతుబాయి ఆలనాపాలనా చూసుకుంటోందన్నారు. ప్రభుత్వం, దాతలు స్పందించి పాలిచ్చే ఆవును ఇస్తే పాప కష్టాలు తీరుతాయని వృద్ధులు వేడుకుంటున్నారు.

- న్యూస్‌టుడే - ఇంద్రవెల్లి, బేల

బ్రహ్మచారిణి రూపంలో బాసర అమ్మవారి దర్శనం



ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర అమ్మవారి ఆలయంలో రెండు రోజుల కిందట ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. రెండో రోజు బ్రహ్మచారిణి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి సన్నిధిలో దీక్షలు తీసుకున్న వారందరూ మధ్యాహ్నం ప్రత్యేక పూజలు చేశారు.

గంగనీళ్ల జాతరకు ఏర్పాట్లు పూర్తి

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే : ఏటా మహాలయ అమావాస్య తర్వాత వచ్చే శని, ఆదివారాల్లో నిర్వహించే గంగనీళ్ల జాతరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సారంగాపూర్ మండలంలోని అడెల్లిలో కొలువైన పోచమ్మ తల్లి నగలను శనివారం దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వి గ్రామానికి చేర్చిన భక్తబృందం పోచమ్మ ఆలయ ప్రాంగణంలో జాగరణ చేస్తారు. ఆదివారం గోదావరి నదిలో అమ్మవారి నగలను శుభ్రపరిచి దిలావర్‌పూర్ మండలం మీదుగా అడెల్లి బయలుదేరుతారు. అమ్మవారి నగలకు బండారు పూసి కొబ్బరి నీళ్లు చల్లి మొక్కులు చెల్లించుకోవడానికి అశేష భక్తజనం వస్తారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై సందీప్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూల పరిమళం.. ఆరోగ్యదాయకం

● బతుకమ్మలో దాగున్న శాస్త్రీయత





బతుకమ్మ పూలు ఇవే..

ఈ సీజన్‌లో బంతి, చామంతి, తామర, అల్లి, గడ్డిపువ్వు, వామపువ్వు, కట్ల, టేకు, స్వస్తీకం, సీతజడలు, మందార, తంగేడు, బీర, కాకర, గునుగు, గుమ్మడి, దోస, తదితర పూలు వికసిస్తాయి.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం : ప్రకృతి ప్రసాదించిన బతుకమ్మ పండగలో చిన్నారులు, యువతులు, మహిళలు భాగస్వాములవుతారు. తొమ్మిది రోజులు ఆడిపాడుతూ బతుకమ్మ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఈ క్రమంలో పూల నుంచి వెలువడే సువాసనలు, వాటి స్పర్శ మహిళల ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని ఆయుర్వేద వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఉత్సవంలో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం దాగి ఉందని శాస్త్రీయంగా రుజువైన నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

చామంతి



చామంతి పూలతో చర్మ సమస్యలు దూరమవుతాయి. జ్వరం, కీళ్ల నొప్పులు తగ్గడానికి దోహదం చేస్తాయి. నిద్రలేమి, ఒత్తిడిని తగ్గిస్తాయి.

బంతిపూలు



బంతిపూల సుగంధ వాసన జలుబు నుంచి ఉపశమనాన్ని కలిగిస్తుంది. కడుపులోని నులి పురుగుల వ్యాధి నివారణకు వాడతారు. ఈ పూల తైలం రక్తస్రావం తగ్గడానికి, కేశాలు పెరగడానికి ఔషధంగా ఆయుర్వేద వైద్యంలో ఉపయోగిస్తారు.

కాకర పూలు



కాకర కాయ, వాటి పూలు మధుమేహ వ్యాధిగ్రస్థులకు దివ్యౌషధంగా పని చేయడమే కాకుండా వారి మానసిక స్థితిని ఉత్సాహంగా ఉంచుతుంది. యాంటిబయాటిక్స్ మందుల తయారీలో కాకర పూల తైలాన్ని ఉపయోగిస్తుంటారు. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది.

గునుగు



ఈ పువ్వులను అతిసార, క్షయ వ్యాధుల నివారణకు ఔషధంగా వాడతారు. ఈ పూల పొడి పెద్ద పేగులోని బద్దె పురుగులను తొలగించడానికి, కంటి సంబంధ రోగ నివారణకు ఉపయోగిస్తారు. మధుమేహం, నోటి పుండ్లు, ముక్కులో రక్తస్రావం తగ్గడానికి ఉపయోగిస్తారు. రక్తపోటును అదుపులో పెడుతుంది.

తంగేడు



దీని ఆకులు, పువ్వుల చూర్ణాన్ని కామెర్లు, తామర లాంటి చర్మ వ్యాధుల నివారణకు ఉపయోగిస్తారు. చెక్కను ఉదరకోశ వ్యాధులకు మందుగా, కళ్లకలక నుంచి ఉపశమనం పొందడానికి ఉపయోగిస్తారు.

గడ్డిపువ్వు



గడ్డి పువ్వును ఆయుర్వేద వైద్యంలో యాంటిబయాటిక్‌గా వాడతారు. రక్తస్రావాన్ని నియంత్రించేందుకు ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో, తండాల్లో, పల్లెల్లో ఈ పూలరసాన్ని ఉపయోగిస్తున్నారు.

గుమ్మడి



శరీర ఉష్ణోగ్రత సమతుల్యం ఉంచేందుకు వీటి పూలు ఆయుర్వేద వైద్యంలో వాడతారు. గుమ్మడి పువ్వు రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఈ పూలలో ఎ-విటమిన్ అధికంగా ఉండటంతో కంటి సంబంధిత రోగాలకు ఔషధంగా ఉపయోగిస్తారు. దగ్గు, జలుబు, వైరల్ జ్వరం తగ్గేందుకు వీటి పూలను మందుగా వాడతారు.

ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు దోహదం



- డా.అనికేత్ వైద్య, ఆయుర్వేద వైద్య నిపుణులు

బతుకమ్మలో వాడే పూలు మహిళల ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షిస్తాయి. ఆ పూలలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఆయుర్వేద వైద్యం తయారీలో వాటిని వాడతారు. మహిళలు బతుకమ్మల చుట్టూ ఆడే సందర్భంలో పూలనుంచి వచ్చే సువాసన, వాటి తాకిడితో జ్ఞానేంద్రియాలు ఉత్తేజితమవుతాయి. పూలను చూడటంతో కంటి చూపు బాగు పడుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఈ నవరాత్రులు బతుకమ్మ ఆడే క్రమంలో వారికి తెలియకుండానే కొన్ని రుగ్మతలు వాటంతట అవే తగ్గిపోతాయి. వర్షాకాలంలో వాగులో, నదిలో కొత్త నీరు చేరుతుంది. సామూహికంగా బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేయడంతో హానికారక క్రిమికీటకాలు నశిస్తాయి. కొన్ని పూలు నీటిని శుద్ధి చేసి జలజీవులను బతికిస్తాయి. నైవేద్యాన్ని సమర్పించడంతో నీటిలోని జీవులకు అవి ఆహారంగా అవుతాయి.

పల్లెల అభివృద్ధి భాజపాతో సాధ్యం


మాట్లాడుతున్న ఎంపీ నగేష్

దస్తురాబాద్, న్యూస్‌టుడే: ప్రజలంతా భాజపా వైపు చూస్తున్నారని ఎంపీ జి.నగేష్ అన్నారు. శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా దస్తురాబాద్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. పల్లెల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రజలంతా కాంగ్రెస్, భారాస పాలనలో విసిగిపోయారని, సభ్యత్వాలు విరివిగా చేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం రేవోజిపేట గ్రామానికి చెందిన కార్యకర్త బొమ్మెన రమేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాథోడ్ రితీష్, ఆకుల శ్రీనివాస్, కొడిమెల లక్ష్మణ్, వెంకటరమణ, సాగర్, రాజు, నాయకులున్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణ

వసతిగృహాల్లో సిబ్బంది కొరత

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ దృష్టికి ఆర్జీయూకేటీ సమస్యలు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీలోని సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆర్జీయూకేటీని శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ భోజనశాల నిర్వాహకులు పట్టిక పాటించడం లేదని, ఇష్టానుసారంగా భోజనం పెడుతున్నారని, గడువు ముగిసినా కొత్త నిర్వాహకులను ఏర్పాటు చేయడం లేదన్నారు. విశ్వవిద్యాలయంలో చీఫ్ వార్డెన్ శ్రీధర్ ప్రవర్తన బాగా లేదని వెంటనే మార్చాలని పలువురు విద్యార్థులు కమిషన్ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. విశ్వవిద్యాలయంలో 60 శాతం బాలికలున్నారని వారి వసతిగృహాల్లో కేర్ టేకర్ల(పోషకుల) కొరత ఉందన్నారు. అనంతరం పరిపాలన విభాగం కాన్ఫరెన్స్ హాల్‌లో ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణతో కలిసి అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. చీఫ్ వార్డెన్ సమావేశానికి ఆలస్యంగా రావడం, విద్యార్థులు పలు ఆరోపణలు చేయడంతో ఆయనపై కమిషన్ ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను తొలగించి నూతన వార్డెన్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. మిగిలిన సమస్యలు పరిష్కరించకపోవడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి పరిస్థితులపై నివేదిక తయారు చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు అందజేస్తానని చెప్పారు. తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎస్సై గణేశ్, విశ్వవిద్యాలయ పరిపాలన విభాగం అధికారి రణధీర్ తదితరులున్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు పయనమైన ఉమ్మడి జిల్లా బాలుర జట్టుతో విద్యాధికారి యాదయ్య తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్లు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం, మెదక్ జిల్లాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లు పయనమయ్యాయి. అండర్-17 బాలబాలికల విభాగంలో శనివారం (బాలురు), ఆదివారం (బాలికలు) నుంచి పోటీలు ప్రారంభం కానుండగా ఆయా జట్ల క్రీడాకారులకు జిల్లా విద్యాధికారి యాదయ్య క్రీడా దుస్తులు అందజేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాంబమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు రామ్మోహన్, బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇవీ జాగ్రత్తలు..

పోలీసులు, దర్యాప్తు సంస్థ ఏదైనా కేసు గురించి ఫోన్ ద్వారా ఆరా తీయవు. బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు వంటి వివరాలు సేకరించవు. కేసు నమోదవ్వకుండా ఉండాలంటే డబ్బు పంపించాలని చెబితే మోసమని గుర్తించాలి. ఎవ్వరికీ పార్సిల్ పంపకున్నా ఇతర దేశాలకు మీ పేరుపై వెళ్తోందంటే నమ్మొద్దు. వివిధ దర్యాప్తు సంస్థల పేర్లతో ఫోన్లు చేస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. ఒకవేళ మోసపోయి డబ్బు కోల్పోతే టోల్‌ఫ్రీ 1930, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

'రెండు రోజుల క్రితం మంచిర్యాలకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి దిల్లీ పోలీసుల పేర్లతో ఫోన్లు వచ్చాయి. మీ అబ్బాయిని సైబర్‌క్రైంలో అరెస్టు చేశాం. మా ఖాతాలోకి డబ్బులు జమ చేయాలంటూ చెప్పగా సదరు ఉద్యోగి తేరుకొని మా అబ్బాయి ఇంట్లోనే ఉన్నాడని సమాధానం చెప్పడంతో నిందితులు ఫోన్లు చేయడం ఆపేశారు.'

సైబర్ వల.. చిక్కితే విలవిల

● దిల్లీ, ముంబయి సైబర్‌క్రైం అధికారులమంటూ ఫోన్లు




సైబర్ నేరం జరిగితే బాధితులు వెంటనే సైబర్‌క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) 1930 కాల్‌సెంటర్‌లో ఫిర్యాదు చేస్తారు. అయితే ఆ కాల్‌సెంటర్, సైబర్‌క్రైం పోలీసుల పేరుతోనే మోసం జరిగితే.. సైబర్ నేరగాళ్లు ఇప్పుడు చేస్తుందిదే. గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ, కస్టమ్స్ అధికారుల పేరుతో భయపెట్టి జనం డబ్బు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు కొంతకాలంగా రూటు మార్చారు. దిల్లీ, ముంబయి సైబర్‌క్రైం విభాగం, 1930 కాల్‌సెంటర్ అధికారులమంటూ వల విసురుతున్నారు.

–న్యూస్‌టుడే, మంచిర్యాల నేరవిభాగం, మందమర్రి పట్టణం,

మోసగిస్తారిలా..

డ్రగ్స్ పార్సిల్ కేసు దర్యాప్తులో భాగంగా అనుమానాస్పద లావాదేవీలు జరిగిన కొన్ని ఖాతాలు గుర్తించామని.. అందులో మీది ఉందంటూ ఫోన్ చేస్తున్నారు. అనుమానాస్పద లావాదేవీలు జరిగాయని, కొంత డబ్బు మీ ఖాతాలో జమయ్యిందంటూ వివరాలు సేకరిస్తున్నారు. కేసు దర్యాప్తుకు సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని, మీ పాత్ర లేనట్లు తేలితే డబ్బు తిరిగి పంపిస్తామంటూ కొంత వసూలు చేస్తున్నారు.

'మందమర్రికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్‌కు ఇటీవల పోలీసుల పేరుతో మాట్లాడి మీపై మనీ లాండరింగ్ కేసు ఉందని బెదిరించి విడతలవారీగా రూ. 1,43,75000 నిందితులు తమ ఖాతాలోకి జమ చేసుకున్నారు.'



మంచిర్యాలకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి వచ్చిన ఫోన్‌కాల్స్ జాబితా

జడ్జిలకు పదోన్నతులు

● మరికొందరికి స్థానచలనం

ఎదులాపురం, మంచిర్యాల న్యాయవిభాగం, న్యూస్‌టుడే : తెలంగాణ హైకోర్టు రాష్ట్ర వ్యాప్తంగా 38 మంది జూనియర్ సివిల్ జడ్జిలకు సీనియర్ సివిల్ జడ్జిలుగా పదోన్నతులు కల్పిస్తూ, మరో 32 మందికి స్థాన చలనం కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో ఒకరు పదోన్నతి పొంది మరో జిల్లాకు బదిలీ అయ్యారు. ఇతర జిల్లాల నుంచి ఇద్దరిని ఉమ్మడి జిల్లాకు బదిలీ చేశారు.

న్యాయమూర్తి	ప్రస్తుత స్థానం	బదిలీ
పదోన్నతులు పొంది బదిలీ అయిన వారు		
మంజుల సూర్యవార్	జూనియర్ సివిల్‌జడ్జి ఆదిలాబాద్	సీనియర్‌సివిల్‌జడ్జి నకిరేకల్(నల్గొండ)
డి. రామ్మోహన్‌రెడ్డి	„ „ ములుగు	„ „ మంచిర్యాల
సి. సంపత్	„ „ మంచిర్యాల	„ „ మంచిర్యాల
స్థాన చలనం అయిన వారు		
జి. శ్రీనివాస్	సీనియర్ సివిల్ జడ్జి నారాయణపేట్	సీనియర్ సివిల్ జడ్జి నిర్మల్
గవ్వల రాధిక	„ „ నిర్మల్	డీఎల్ఎస్ఏ కార్యదర్శి నిర్మల్
అర్పిత మారంరెడ్డి	„ „ మంచిర్యాల	„ „ మంచిర్యాల

గుమ్మడి కాయంత పరిమాణం.. ద్రాక్షపండు రుచి


చెట్టుకు కాసిన పనర పనస పండ్లు

పెద్ద సైజులో ఉన్న ఈ కాయలను చూసిన వారు ఇవేమని ఆశ్చర్యపోతున్నారు. ఇది గోల్డెన్ బ్లూమ్ గ్రాఫ్టెడ్ పొమెలో ఫ్రూట్ లేదా పనర పనస లేదా గజ నిమ్మ అంటారు. ఇవి ఆగ్నేయ ఆసియా దేశాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఖానాపూర్ మండలం మస్కాపూర్ మధురానగర్ కాలనీకి చెందిన శ్రవణ్ తన ఇంట్లో అయిదేళ్ల కిందట నాటిన మొక్క పెద్దదై పండ్లను ఇస్తోంది. గుమ్మడికాయ సైజులో ఈ పండ్లు కాస్తాయని, ద్రాక్షపండు రుచిని పోలి ఉంటుందని శ్రవణ్ చెప్పారు. ఈ పండులో పొటాషియం, విటమిన్-సి పుష్కలంగా ఉంటాయని నిర్మల్‌కు చెందిన వృక్షశాస్త్ర ఉపాధ్యాయుడు మోహన్‌రావ్ తెలిపారు. -న్యూస్‌టుడే, ఖానాపూర్

మేమున్నాం.. మీకు తోడుగా...
నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

?: పట్టణంలోని విద్యానగర్ కన్సలకుంట ఒడ్డున చెత్తా చెదారం వేస్తున్నారు. దుర్గంధం రావడంతో చుట్టుపక్కల కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - మహేష్, ఖానాపూర్

✓: ఇంటింటికే చెత్తబండి వస్తుంది. అందులో చెత్త వేయాలి. కన్సల కుంట వద్ద వేసిన చెత్తను తొలగిస్తాం. - శంకర్, మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌ఛార్జి - న్యూస్‌టుడే, ఖానాపూర్

అక్రమ కేసులు ఎత్తివేయాలి


భైంసాలో ఏఎస్పీ అవినాష్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న హిందూ సంఘాల నాయకులు

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: ఓ వర్గానికి సంబంధించిన పోలీసు అధికారులు హిందువులపై అక్రమ కేసులు పెడుతున్నారని హిందూ ధర్మ పరిరక్షణ సమితి నాయకులు ఆరోపించారు. అక్రమ కేసులు ఎత్తివేయాలని శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఏఎస్పీ అవినాష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల కుబీర్ మండలంలో జరిగిన ఘటనలో ఓ వర్గం యువకుడు మరో వర్గానికి చెందిన బాలికకు మాయ మాటలు చెప్పి భైంసా తీసుకొచ్చి అత్యాచారానికి యత్నిస్తే అడ్డుకున్న వారిపై హత్యాయత్నం కేసు పెట్టడం, అర్ధరాత్రి ఇళ్లలోకి వెళ్లి అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. సదరు యువకుడి వద్ద మారణాయుధాలున్నాయన్నారు. పట్టణంలో గతంలో నిషేధిత పీఎఫ్ఐ సంస్థలో శిక్షణ తీసుకున్న కొందరు పట్టుబడిన నేపథ్యంలో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

న్యాయ పోరాటం తప్పదు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: ఓ వర్గానికి అనుకూలంగా ఉండేందుకు హిందువులపై తప్పుడు కేసులు పెట్టాలనుకోవడం సరికాదని భాజపా జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కుబీరులో లవ్‌జిహాద్ ఘటన చోటు చేసుకుందని, ఓ వర్గానికి చెందిన వ్యక్తి హిందూ మైనర్‌ను ప్రేమ పేరిట మోసగించి, వీడియోలు తీసి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. వీటిని అడ్డుపెట్టుకొని ఆమెను బలవంతంగా భైంసా పట్టణానికి తీసుకొచ్చిన సమయంలో అక్కడున్న హిందువులు దాన్ని గమనించి అతడిని పోలీసులకు అప్పగించారన్నారు. దీంతో యువకుడి మద్దతుదారులు పోలీస్‌స్టేషన్‌ను చుట్టుముట్టి పోక్సో కేసు రద్దు చేయాలని డిమాండ్ చేయడం, అతడిని కొట్టినట్లు దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ ఘటనలో హిందువులపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడం దారుణమన్నారు. హిందుత్వం పాటించకుండా 30 పోలీసుయాక్ట్‌ను అమలుచేస్తున్నారని, దాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వరరెడ్డి, కమల్‌నయన్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ధ్రువపత్రాలు పరిశీలించాలి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: డీఎస్సీ నియామక ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తొడిశెట్టి రవికాంత్ కోరారు. జిల్లా విద్యాధికారి డా.ఎ.రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కొత్త నియామకాలు పూర్తయ్యేలోపు గతంలో బదిలీ అయిన ఎస్జీటీలకు రిలీవ్ ఉత్తర్వులు అందించాలన్నారు. అనంతరం జిల్లాశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఖజానాశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సరోజను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. నాయకులు పోల ధర్మరాజ్, ఎ.లక్ష్మీప్రసాద్‌రెడ్డి, రాథోడ్ రఘునాథ్, అనూష తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ వార్డెన్‌కే మద్దతు : టీఎస్ఏఎస్

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీ చీఫ్ వార్డెన్ శ్రీధర్‌కే తమ మద్దతు ఉంటుందని ఆర్జీయూకేటీ టీఎస్ఏఎస్(తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ) శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆర్జీయూకేటీని సందర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య తనిఖీలో 9 వేల మంది విద్యార్థులకు ఆరుగురు కేర్ టేకర్లు ఉన్నారని బయట పడిందన్నారు. ఇది అధికారుల నిర్లక్ష్యమని అన్నారు. శ్రీధర్ వసతి గృహాల్లో కేర్ టేకర్లను నియమించాలని చాలా సార్లు చెప్పారన్నారు. ఆయనపై కొందరు కావాలని నిందలు వేస్తున్నారన్నారు. తమ మద్దతు ఆయనకే ఉంటుందన్నారు. ఉపకులపతి వెంకటరమణపై వచ్చిన ఆరోపణలు శ్రీధర్‌కు బదలాయించడానికి ఇతరుల రాజకీయ వ్యూహమని టీఎస్ఏఎస్ అభిప్రాయపడింది.

'క్రిప్టో కరెన్సీ లావాదేవీలు నిర్వహించిన వారిని అరెస్టు చేయడం అన్యాయం'

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: క్రిప్టో కరెన్సీని కొనుగోలు చేసి లావాదేవీలు నిర్వహించి లాభాలు పొందితే 30 శాతం పన్ను చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిన దృష్ట్యా ఇది అక్రమం ఎలా అవుతుందని హైకోర్టు న్యాయవాది హబీబ్ సుల్తాన్ అలీ ప్రశ్నించారు. క్రిప్టో కరెన్సీ లావాదేవీలు నిర్వహించిన వారిని నిర్మల్ పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమన్నారు. పోలీసులు అరెస్టు చేసిన ఆయుధగురికి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసిందన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ క్రిప్టో కరెన్సీ పేరిట అక్రమ దందా నిర్వహిస్తున్నారని నిర్మల్ పోలీసులు ఆగస్టు 31న ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఇద్దరు కానిస్టేబుళ్లను అరెస్టు చేసి నెల రోజులు జైల్లో పెట్టారన్నారు. దీంతో వారు ఉద్యోగాలు కోల్పోయారని చెప్పారు. పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించడంతో అరెస్టయిన ఆయుధ గురు సమాజంలో తల ఎత్తుకోలేని పరిస్థితి ఉందని, ఉద్యోగం, పరువు పోవడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులు రాజేశ్వర, సునీతాయాదవ్, హేమలత, విజయదుర్గ, సిరాజ్ సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో పోలీసుల తనిఖీలు

ఖానాపూర్: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో శుక్రవారం ఉదయం పోలీసులు నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. కాలనీలో పోలీసు బృందం కాలనీ శివారు, పశువుల పాకలు, ఇళ్లలో తనిఖీ చేపట్టారు. సీఐ సైదారావ్ నేతృత్వంలో చేపట్టిన తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 50 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు, రెండు మోటారు క్యాబ్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నంబరు ప్లేటు లేని వాహనాలకు జరిమానా విధించారు. ఎస్సై రాహుల్ గైక్వాడ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు.. చిచ్చరపిడుగులు

జాతీయ కరాటే పోటీల్లో మెరిసిన లోకేశ్వరం విద్యార్థులు


నిర్మల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గెలుపొందిన పతకాలు, పత్రాలను చూపుతున్న విద్యార్థులు

లోకేశ్వరం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఆట, పాటల్లోనూ ప్రతిభ చూపాలంటే ప్రాథమిక విద్య నుంచే వాటిలో శిక్షణ ఉండాలి. అలాంటప్పుడే వారిలో బెరుకు, భయం పోయి రాటుదేలుతారు. లోకేశ్వరం మండలంలోని పలువురు చిన్నారులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. కరాటే మాస్టర్ గజేందర్ వీరికి పాఠశాలలో వారానికి రెండు రోజులు ఇచ్చే శిక్షణ సద్వినియోగం చేసుకుని ఇటీవల నిర్మల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే (కుమితే, కాటా విభాగాలు) పోటీల్లో పాల్గొని పతకాలను సాధించారు.

☛ కుమితే విభాగంలో హర్షశ్రీ, వైష్ణవి, హర్షిణి, మిధున్, అర్జున్‌ప్రసాద్, రవిచంద్ర, మల్లికార్జున్(స్వర్ణ), మీనాక్షి, సహస్ర, దివిజ, క్షిత, అక్షిత్, రవిచంద్ర, సమన్విత(రజత), అమృత, ఈశ్వర్(కాంస్య) పతకాలు గెలుపొందారు. కాటా విభాగంలో అనన్య(స్వర్ణ), సుచిత్ర(రజత), ఆనంది(కాంస్య) పతకాలు సాధించారు.

చాలా విషయాలు తెలిశాయి.. అక్షిత్, మల్లికార్జున్



రోజూ పాఠశాలలో మేం మాత్రమే శిక్షణ పొందేవాళ్లం.. మాలో మాకే పోటీ అనిపించేది. తొలిసారి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాక ఆటలో చాలా మెలకువలు తెలిశాయి. ఇలాంటి పోటీలు ఆట మెరుగుకు దోహదం చేస్తాయి.

భయమేసింది: అరుణ్‌ప్రసాద్, రవిచంద్ర



నిర్మల్‌లో జాతీయ స్థాయి పోటీలు అనగానే మొదట భయమేసింది. అక్కడికి వెళ్లాక మా గురువు నిర్వాహకులతో మాట్లాడి మాలో భయాన్ని పోగొట్టారు. పోటీలో మొదటి సారి పాల్గొన్న మాలో ఒకరికి స్వర్ణ, మరొకరికి రజత పతకాలు రావడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో ఎక్కువ సమయాన్ని కేటాయించి పోటీల్లో రాణించేందుకు ప్రయత్నిస్తాం.

ఆత్మరక్షణకు దోహదం: హర్షిణి, హర్షశ్రీ



మా పాఠశాలలో వారానికి రెండు రోజులు కరాటే శిక్షణ ఇస్తారు. ఆరంభం నుంచి ఇప్పటి వరకు ఏనాడూ గైర్హాజరు కాకుండా తప్పకుండా శిక్షణలో పాల్గొంటున్నాం. నిర్మల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలో మాకు బంగారు పతకాలు రావడంతో సంతోషంగా ఉంది. ఈ శిక్షణ పోటీలకే కాకుండా భవిష్యత్తులో ఆత్మరక్షణకు సైతం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

స్వర్ణ పతకాలు మా లక్ష్యం: మీనాక్షి, సమన్విత



జాతీయ స్థాయి పోటీల్లో కుమితే విభాగంలో పాల్గొన్న మాకు రజత పతకాలు దక్కాయి. ఇకపై శిక్షణపై మరింత దృష్టి పెట్టి సాధన చేస్తాం. మళ్లీ పాల్గొనే పోటీలలో బంగారు పతకాలు దక్కించుకునేందుకు ప్రయత్నం చేస్తాం.

పథకాలు రైతులకు అందేలా చూడాలి: ఎమ్మెల్యే


భైంసాలో డీఏఓ అంజిప్రసాద్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలు రైతులకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వ్యవసాయ విస్తరణాధికారులు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సూచనలు చేయాలన్నారు. పంట వివరాల నమోదు పారదర్శకంగా చేపట్టాలని పేర్కొన్నారు. రాయితీ పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఏడీఏ వీణ, ఏఓ గణేష్, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

☛ పీఏసీఎస్ ఆధ్వర్యంలో కుబీర్ ఏఎంసీ ప్రాంగణంలో, భైంసా మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే రామారావుపటేల్ తెలిపారు.

భైంసా గ్రామీణం: భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లీలో బాగులాల గుట్ట సాయిబాబా ఆలయంలో రూ.36 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శుక్రవారం ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పీఆర్‌టీయూ అధికార ప్రతినిధి, వీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్మల్‌లోని రెడ్డి ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని విద్యాలయాల్లో సుమారు 29 వేల మంది పదోన్నతులు కల్పించి ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ఉమ్మడి సర్వీసు రూల్స్ సాధిస్తామని వెల్లడించారు. 317తో నష్టపోయిన వారికి స్థానికత ఇప్పిస్తామని, సీపీఎస్‌ను రద్దు చేయించి ఇబ్బందులు తీరుస్తామని చెప్పారు. ప్రతి వేసవిలో ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు తప్పనిసరిగా చేసేలా క్యాలెండర్ రూపకల్పన చేయిస్తామని అన్నారు. పెండింగ్ డీఏలు కలిసి మూడు అయినా దసరాకు ప్రకటించాలని కోరారు. అంతకుముందు పట్టణంలో జిల్లా కార్యాలయాన్ని మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, పర్వతి సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి యాటకారి సాయన్న, చక్రాల హరిప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్కాల గంగాధర్‌రావు పాల్గొన్నారు.

జగిత్యాల-కడెం బస్సు పునఃప్రారంభం

రాయికల్: జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి రాయికల్ మండలం బోర్నపల్లి మీదుగా నిర్మల్ జిల్లా కడెంకు ఆర్టీసీ బస్సును పునఃప్రారంభించారు. ఉ.6:50, 11:00, మధ్యాహ్నం 3:20 గంటలకు జగిత్యాల నుంచి కడెం బస్సు బయలు దేరుతుంది. తిరిగి ఉదయం 9:10, మధ్యాహ్నం 01:00, సాయంత్రం 5.00 గంటలకు కడెం నుంచి జగిత్యాలకు వస్తుంది. బస్సు పునఃప్రారంభంతో ఇరు జిల్లాల మధ్య రాకపోకలు పెరగనున్నాయి.


భైంసా: తిమ్మాపూర్‌లో కల్లం చుట్టూ ఉన్న నీటిని మళ్లిస్తున్న రైతులు


కల్లూరులో జలమయమైన కుంటాల-కల్లూరు ప్రధాన కూడలి

భారీ వర్షం.. రైతులకు కష్టం

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయ్యాయి. అప్పటి వరకు ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. కల్లాల్లోని సోయా పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. సోయా కుప్పల చుట్టూ చేరిన నీటిని మళ్లించేందుకు అన్నదాతలు శ్రమించాల్సి వచ్చింది. కోత దశలోని సోయా పంటను నూర్పిడి చేసేందుకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని రైతులు వాపోతున్నారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కల్లాల్లోని సోయా, మొక్కజొన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు టార్పాలిన్ కవర్లు పట్టుకుని పరుగులు తీశారు. వర్షం కారణంగా కోత దశలోని సోయా నూర్పిడి పనులకు ఆటంకం కలుగుతోంది. ప్రభుత్వం క్లస్టర్ల వారీగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతుగా నిలవాలని కర్షకులు కోరుతున్నారు.

ఇంటింటా వివరాల సేకరణ

ఖానాపూర్, న్యూస్‌టుడే: రేషన్‌కార్డులు, ఆరోగ్యకార్డుల స్థానంలో డిజిటల్‌కార్డులు అందించేందుకు ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నాలుగోవార్డు శ్రీరాంనగర్ కాలనీలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది శుక్రవారం రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డుల వివరాలు సేకరించారు. వార్డు అధికారి పద్మ, ఆర్‌పీ మంగ, సులోచన, ఏడబ్ల్యూటీ లక్ష్మి పాల్గొన్నారు.

ఖానాపూర్ గ్రామీణం: కుటుంబ డిజిటల్ కార్డు పైలట్ సర్వేలో మహిళ పేరు ముందుగా నమోదు చేయాలని నోడల్ అధికారి గోవింద్ సర్వే బృందాలకు సూచించారు. శుక్రవారం మండలంలోని కొత్తపేట్ గ్రామంలో రెండో రోజు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. అధికారులు వివరాలు సేకరించేటప్పుడు కుటుంబ సభ్యులు వారికి సహకరించాలన్నారు. ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్ రావు పాల్గొన్నారు.

అటవీప్రాంతంలో పక్షుల వీక్షణ

ఖానాపూర్, న్యూస్‌టుడే: కవ్వాల్ టైగర్ రిజర్వు ప్రాంతంలోని మండలంలోని సత్తనపల్లి అటవీప్రాంతంలో '70వ వన్యప్రాణి సప్త' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అటవీ అధికారుల సమక్షంలో భాగంగా పక్షుల వీక్షణ నిర్వహించారు. ఎఫ్ఆర్వో కిరణ్, ఎఫ్ఎస్‌వోలు పాల్గొన్నారు.

కడెం : కడెం, ఉడుంపూర్ అటవీ రేంజిల పరిధిలో రకరకాల పక్షులు ఉన్నాయని అటవీ అధికారులు పేర్కొన్నారు. 70వ వన్యప్రాణి వారోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉడుంపూర్ రేంజి పరిధిలోని కల్పకుంట వాచ్‌టవర్ వద్ద బర్డ్ వాచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్వోలు డి.ప్రకాష్, చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎఫ్ఎస్‌ఓలు, ఎఫ్‌బీలు బైనాక్యులర్ సహాయంతో పక్షులను వీక్షిస్తూ కెమెరాల్లో చిత్రీకరించారు. కడెం రేంజి పరిధిలోను డీఆర్వోలు ప్రకాష్, సిద్ధార్థల ఆధ్వర్యంలో జలాశయం పరిసరాల్లో బర్డ్‌వాచ్ కార్యక్రమం నిర్వహించారు.

కడెం: కడెం జలాశయంతోపాటు పక్కనే ఉన్న సహ్యాద్రి కొండల్లోని అడవిని హైకోర్టులో ప్రభుత్వ ప్లీడరు(సర్వీసెస్) సత్యనారాయణ రావు శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. గంగాపూర్ దారిలో కొండలపై ఉన్న పాత వాచ్‌టవర్ ఎక్కి అటవీ అందాలను ఆస్వాదించారు. కవ్వాల్ పెద్దపులుల పరిధిలోని ఈ రేంజిలో అటవీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ఎఫ్ఆర్వో గీతారాణి ఆయనకు వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో శిక్షకుడు సుదర్శన్

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ పోటీలకు పట్టణంలోని లక్కీ క్రికెట్ అకాడమీకి చెందిన గౌరీకర్ నీరజ్, ఎస్.కె.ఫర్హాన్ ఎంపికయ్యారని అకాడమీ శిక్షకుడు బేర సుదర్శన్ తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జోనల్ టోర్నీలో ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. గద్వాల జిల్లాలో 7 నుంచి ఈ నెల 10 తేదీ వరకు చేపట్టనున్న రాష్ట్ర టోర్నీలో పాల్గొననున్నారని వెల్లడించారు.


ప్రణయ్

భైంసా గ్రామీణం: మండలంలోని కథ్‌గాం గ్రామానికి చెందిన ప్రణయ్ ఇటీవల నిర్మల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. పట్టణంలోని వాసవి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. శిక్షకుడు ముత్యం ఆధ్వర్యంలో సాధన చేసి సఫలీకృతుడయ్యాడు. ప్రిన్సిపల్ ప్రసాద్, ఉపాధ్యాయులు ప్రణయ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

వృత్తి నైపుణ్య శిక్షణ అందించాలి

నిర్మల్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పొందేలా వృత్తి నైపుణ్య శిక్షణ అందించాలని జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిరుద్యోగ యువత శిక్షణపై జిల్లాస్థాయి వృత్తి నైపుణ్య సొసైటీ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వివిధ పథకాలతో లబ్ధి పొందేలా వసతితో కూడిన శిక్షణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయన్నారు. జిల్లాలోని ఐటీఐ, పాలిటెక్నిక్, ఇతర వృత్తి నైపుణ్య కేంద్రాల ద్వారా ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, సోలార్, ఏసీ టెక్నీషియన్, మార్కెటింగ్, బ్యూటీషియన్, తదితర రంగాల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. అదనపు పాలనాధికారి (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, సీపీవో జీవరత్నం, డీఆర్డీవో విజయలక్ష్మి, మాధ్యమిక జిల్లా విద్యాధికారి పరశురాం, డీటీడీవో అంబాజీ, జిల్లా ఉపాధి కల్పన అధికారి శంకర్ ఉన్నారు.

బాసర అమ్మవారికి ప్రత్యేక పూజలు


అమ్మవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: నవరాత్రుల సందర్భంగా రాజ్యసభ సభ్యుడు పార్థసారథిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి సందర్భంగా ఆలయ సందర్భంగా నిజామాబాద్ చెందిన పలువురు విద్యార్థినులు చేపట్టిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉదయం, సాయంత్రం చతుషష్టి పూజలు, మహాహారతులు, నివేదన నిర్వహించారు.

ముథోల్(బాసర): బాసర అమ్మవారిని శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు స్వాగతం పలికారు. ఆలయంలో కుంకుమపూజ, మహాహారతి తదితర పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయం తరపున వేద పండితులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈఓ విజయరామారావు సన్మానించి అమ్మవారి జ్ఞాపిక అందజేశారు. తహసీల్దార్ పవన్‌చంద్ర, భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, సీఐ మల్లేష్, ఎస్సై గణేశ్ తదితరులున్నారు.

కమీషన్ల కోసం కార్మికులకు తిప్పలు

నిర్మల్ పట్టణం: గుత్తేదార్ల నుంచి వచ్చే కమీషన్ల కోసం ఆరాటపడుతూ మున్సిపల్ కార్మికులు వేతనాలు చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని భాజపా పెద్దపల్లి జిల్లా ఇన్‌ఛార్జి రావుల రాంనాథ్ విమర్శించారు. అందుకే చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించడంలో చూపుతున్న శ్రద్ధ కార్మికుల వేతనాలు ఇవ్వడంలో చూపడం లేదని మండిపడ్డారు. దేవి శరన్నవరాత్రుల నేపథ్యంలో పట్టణమంతా ఎక్కడచూసినా చెత్తచెదారం పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోందని, దీనివల్ల భక్తులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. హిందూ పండగల సమయంలో 30 పోలీస్‌యాక్ట్ అమలు చేస్తుండటం, డీజేలపై నిషేధం విధించడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు.

కళాశాలలో బతుకమ్మ సంబరాలు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక వశిష్ఠ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పువ్వులతో బతుకమ్మను తీర్చిదిద్దారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నృత్యాలు, చప్పట్లు, కోలాటాలతో పాటలు పాడి సందడి చేశారు. ప్రిన్సిపల్ డా.అఖిలేశ్‌కుమార్‌సింగ్, వైస్ ప్రిన్సిపల్ శశిధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్ పట్టణం: ఏబీవీపీ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎస్.ఎస్.ఆర్.జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమ విశిష్టతను సంఘం ఇందూరు విభాగ్ స్టూడెంట్ ఫర్ సేవా కన్వీనర్ చంద్రగిరి శివకుమార్ వివరించారు. సంస్కృతి, సంప్రదాయాలను ఆచరించాలని, భవిష్యత్తుతరాలకు అందించాలని కోరారు. ప్రిన్సిపల్ గోవర్ధన్, సురేశ్, రాజు, వంశీ, దినేశ్, మున్నా, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'రాబోయేది భాజపా ప్రభుత్వమే'

కడెం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో రానున్న రోజుల్లో భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఎంపీ జి.నగేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని నవాబుపేటలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా పలువురికి సభ్యత్వం అందజేశారు. నాయకుడు రితీష్ రాథోడ్, శ్రీనివాస్ యాదవ్, ఆకుల శ్రీనివాస్, రవి గౌడ్, సత్తయ్య యాదవ్, నల్లగొండ, మోహన్ నాయక్ పాల్గొన్నారు.

ఖానాపూర్: కేంద్రప్రభుత్వం గ్రామపంచాయతీలకు నేరుగా మంజూరు చేస్తున్న నిధులతో పంచాయతీలు అభివృద్ధి సాధిస్తున్నాయని ఎంపీ గోడం నగేష్ అన్నారు. మండలంలోని బాదనకుర్తి గ్రామంలో జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నాయకుడు రితీష్‌రాథోడ్‌తో కలిసి భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ యువకుల సభ్యత్వం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అంతకుముందు ఖానాపూర్ పట్టణంలోని పద్మశాలీ సంఘ భవనం, మున్నూరుకాపు సంఘంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మకు పూజలు


కడెం: లింగాపూర్‌లో పూజలందుకుంటున్న దుర్గామాత


సోన్ మండలం కూచన్‌పల్లిలో పుష్కరకాలంగా నెలకొల్పుతున్న అమ్మవారి విగ్రహం వద్ద భక్తులు


దిలావర్‌పూర్ మండలం లోలంలో..


ఇంద్రనగర్ గంగపుత్రకాలనీలో ..


అంబేడ్కర్ నగర్ కాలనీలో పూజలో పాల్గొన్న భవానీదీక్షాపరులు


భైంసా: తిమ్మాపూర్‌లో కుంకుమార్చన చేస్తున్న భక్తులు


కుంటాల మండలం ఓలాలో ..

జిల్లావ్యాప్తంగా దుర్గాదేవి అమ్మవారు రెండో రోజు శుక్రవారం ఘనంగా పూజలందుకున్నారు. పంచామృతాలతో అభిషేకంతోపాటు వివిధ రకాల పూజలు నిర్వహించారు. భవానీ దీక్షాపరులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.
-న్యూస్‌టుడే, ఖానాపూర్, కడెం, దిలావర్‌పూర్, భైంసా గ్రామీణం

జిల్లా బోధనాసుపత్రి పర్యవేక్షకుడిగా గోపాల్‌సింగ్

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని బోధనాసుపత్రి పర్యవేక్షకుడిగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ గోపాల్‌సింగ్ జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఇప్పటి వరకు పర్యవేక్షకుడిగా డా.సునీల్‌కుమార్ విధులు నిర్వహించారు. డా.శ్రీనివాస్, డా.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లాకవికి ధ్రువపత్రం అందజేత

నిర్మల్ అర్బన్ : మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 2, 3, 4న జరిగిన మహాత్మా గాంధీ కవితోత్సవంలో జిల్లా కవి బి.వెంకట్‌కు ధ్రువపత్రం లభించినట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్ వేదికగా కార్యక్రమం చేపట్టగా తనదైన శైలిలో తేటగీతి పద్యాలు చెప్పడంతో ఫౌండేషన్ నిర్వాహకులు పొట్లూరి హరికృష్ణ, లహరి, ఉమామహేశ్వరి సర్టిఫికెట్‌ను పంపించారని పేర్కొన్నారు.

నూతన నియామకం

నిర్మల్: బీసీ సంఘర్షణ సమితి నిర్మల్ పట్టణాధ్యక్షుడిగా చిట్యాల వెంకటరమణను నియమించినట్లు ఆ సమితి జిల్లా అధికార ప్రతినిధి ఎర్రవోతు లింగన్న తెలిపారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు అప్క గజేందర్‌యాదవ్ ఆదేశాల మేరకు పట్టణంలో బీసీ సంఘర్షణ సమితిని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. బడుగు బలహీనవర్గాల సమస్యలు పరిష్కరించడంతో పాటు హక్కుల సాధనకు కృషి చేస్తున్నామని చెప్పారు.

సంక్షిప్త సమాచారం

వృద్ధుడిని కాపాడిన గంగపుత్రులు

ముథోల్(బాసర): బాసర గోదావరి పుష్కరఘాట్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వృద్ధుడు ఒక్కసారిగా గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన గంగపుత్రులు పోలీసులు సమాచారం అందించి గోదావరిలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. అనంతరం పోలీసులు అతడిని అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోచమ్మను దర్శించుకున్న డీటీవో మహేందర్

సారంగాపూర్: అడెల్లి మహాపోచమ్మ ఆలయాన్ని శుక్రవారం జిల్లా రవాణాశాఖ అధికారి మహేందర్, సదర్మాట్ ప్రాజెక్టు డీఈ సురేందర్‌లు సందర్శించారు. బాలాలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సీనియర్ అసిస్టెంట్లు రాజేశ్, రమణారావు, అర్చకుడు శ్రీనివాసశర్మ అమ్మవారి తీర్థప్రసాదాలతో సత్కరించారు.

యాకర్‌పల్లిలో నిఘా నేత్రాల పునరుద్ధరణ

సారంగాపూర్: గంగనీళ్ల జాతర నేపథ్యంలో మండలంలోని యాకర్‌పల్లిలో శుక్రవారం నిఘా నేత్రాలను పునరుద్ధరించారు. సారంగాపూర్ ఎస్సై ఎస్.శ్రీకాంత్ గ్రామస్థులతో సమావేశమై భద్రత, రక్షణ తదితర విషయాలపై వివరించారు. ఎస్సై సలహాలతో వీడీసీ సభ్యులు ఎనిమిది నిఘా నేత్రాలకు మరమ్మతులు చేయించారు.

కాంగ్రెస్‌లో మహిళా అభ్యున్నతి

కడెం: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అనేక రంగాల్లో చేయూతనిస్తోందని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి పరిమళ అన్నారు. శుక్రవారం మండలంలోని పలుగ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం అనంతరం కడెంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు. శారద, సుజాత, లక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.


లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆకట్టుకున్న వేడుకలు

లోకేశ్వరం: లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ శుక్రవారం కళాశాలలో ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. పలువురు విద్యార్థులు తమ ఆటపాటలతో అలరింపజేశారు. కష్టపడి చదివితే తప్పకుండా ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ప్రిన్సిపల్ గౌతం విద్యార్థులకు సూచించారు.